క్లుప్తంగా

డ్రాయింగ్ పోటీలు


డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళిఘణాపూర్ ఎంజేపీ రెసిడెన్షియల్ పాఠశాలలో అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించామని పాఠశాల ప్రిన్సిపాల్ సృజన తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న కళా నైపుణ్యతను వెలికి తీసేందుకు డ్రాయింగ్, క్రాఫ్ట్‌మేకింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుతులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీ నాగరాజు, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ గ్రామసభలు


ఉపాధిహామీ గ్రామసభలో కోళాపల్లి గ్రామస్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలు కొనసాగుతున్నాయి.శుక్రవారంగొట్టిముక్కుల, కోళాపల్లి తదితర గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా 2024–25కి గాను చేపట్టబోయే పనులపై గ్రామసభలో చర్చించారు. గ్రామసభలను ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపిఓ నవాజుద్దీన్, టీఏలు స్వాతి, వినోద, మోహన్, స్వప్న, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ


మాట్లాడుతున్న ఆర్‌డీఓ రమాదేవి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మెదక్ ఆర్‌డీఓ రమాదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ రికార్డులు పరిశీలించి, ధరణి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై తహసీల్దార్‌కు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు పట్టభద్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

ఒకరికి తీవ్ర గాయాలు

అల్లాదుర్గం(మెదక్): ఆర్టీసీ బస్సును బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొంది. ఈ సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్లాపూర్ గ్రామ శివారులో 161 రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామానికి చెందిన అలిగే పోచయ్య టీవీఎస్‌పై ముస్లాపూర్ నుంచి పెద్దాపూర్ వైపు రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా, లింగంపల్లి నుంచి నారాయణఖేడ్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ముస్లాపూర్ శివారులో ఢీకొన్నాడు. దీంతో పోచయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు. బస్సు డ్రైవర్ బీమ్లానాయక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అండర్ 14 క్రికెట్‌లో అక్షిత్ ప్రతిభ


అవార్డుతో అక్షిత్ రంగాగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామానికి చెందిన అక్షిత్ రంగాగౌడ్ క్రికెట్‌లో అత్యున్నత ప్రతిభను కనబర్చాడు. అండర్ 14 విభాగంలో నాసిక్‌లో నిర్వహించిన పాఠశాల క్రికెట్ పోటీల్లో పాల్గొ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌ను అందుకున్నాడు. అలాగే మెదక్ జిల్లా నుంచి తూప్రాన్ ఒలింపియా ఇంటర్నేషనల్ స్కూల్ టీమ్ నాసిక్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచింది.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గజ్వేల్‌రూరల్: రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మరొకరి ప్రాణాలను కాపాడొచ్చని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పనులపై ఆరా

● ట్రైనీల పర్యటన

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనీ ఐఏఎస్‌లు యోగేష్ కుమార్, హితేష్ బందిల్వాల్, ఆశిశ్ కుమార్, మోహిబుల్లా అన్సారి, సావిక్‌లు హాజరై పట్టణ అభివృద్ధి, సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారిని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమిషనర్, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌లకు మెదక్ మున్సిపాలిటి మెదక్‌లోని వార్డుల సంఖ్య, మున్సిపాలిటీ నుంచి ప్రజలకు అందించే సేవలు శానిటేషన్, వాటర్ సప్లయ్, వీధి దీపాలు, అభివృద్ధి పనులను చైర్మన్ చంద్రపాల్ వివరించారు. అనంతరం మున్సిపల్ ఎజెండా అంశంపై సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు, కమిషనర్, జానకి రాంసాగర్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తూప్రాన్: మున్సిపల్ పరిధిలో ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు పది మంది బృందం శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కమిషనర్ ఖజామొయిజుద్దీన్‌లతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం అయ్యారు. అనంతరం ఐదు బృందాలుగా ఏర్పడి, ఆయా వార్డుల్లో శానిటేషన్, ప్రభుత్వ పథకాలు, ప్రజల స్థితిగతులు, ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కమిషనర్ ఖాజామోహిజొద్దీన్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుస్తుంపేటలో..

నర్సాపూర్ రూరల్: మండల పరిధిలోని రుస్తుంపేట గ్రామాన్ని ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారుల బృందం శుక్రవారం సందర్శించారు. అధికారులు ట్రైనింగ్‌లో భాగంగా రుస్తుపేటను గ్రామపంచాయతీ రికార్డులను, గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ప్రజల ఆర్థిక స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాపన్నపేట మండలంలోని ఏడుపాయల దుర్గామాతను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మతలత, మాజీ సర్పంచ్ విజయ భాస్కర్ రాజు, మాజీ ఎంపీటీసీ లక్ష్మిఅశోక్ తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్ రూరల్: రుస్తుంపేటలో పర్యటిస్తున్న ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారుల బృందం


మెదక్ మున్సిపాలిటీ: మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న ట్రైనీ ఐఏఎస్‌లు


తూప్రాన్: ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న ట్రైనీ అధికారులు

పెద్దశంకరంపేట బంద్ ప్రశాంతం


పెద్దశంకరంపేట(మెదక్): ర్యాలీలో పాల్గొన్న హిందూ సంఘాల నాయకులు


రేగోడ్(మెదక్): నిరసన తెలుపుతున్న హిందూ సంస్థల సభ్యులు

పెద్దశంకరంపేట(మెదక్): రాష్ట్రంలో హిందూ దేవతల విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ హిందూ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు మండల కేంద్రంలో సంపూర్ణ బంద్‌ను నిర్వహించారు. శుక్రవారం తమ వ్యాపార వాణిజ్య సముదాయాలను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేశారు. స్థానిక రామాలయం నుంచి జైశ్రీరామ్, జైభారత్‌మాత అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. హిందూ దేవతల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌ఐ శంకర్ పర్యవేక్షించారు.

రేగోడ్ బంద్

రేగోడ్(మెదక్): సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంపై దాడికి నిరసనగా రేగోడ్ మండల కేంద్రంలో శుక్రవారం పలు హిందూ సంస్థలు రేగోడ్ బంద్ చేపట్టారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా ర్యాలీతో పాటు పలు దుకాణాలను మూసేయించారు. విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి


రాందాస్‌గూడలో గేదెకు గాలికుంటు టీకా వేస్తున్న పశువైద్యాధికారి వినోద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వలన పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, పశువు ఆరోగ్యంగా, బలంగా తయారవుతుందని వెటర్నరీ సర్జన్ వినోద్ అన్నారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని రాందాస్‌గూడ గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పశువులకు టీకా ఇప్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సర్జన్ వినోద్ , వెటర్నరీ అసిస్టెంట్ ఇబ్రహీం, ఓఎస్ శంకర్, అరవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

ఎంపీడీఓ చంద్రశేఖర్

అల్లాదుర్గం(మెదక్): ఇళ్లల్లో, ఆరుబయట పరిసరాలు శుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు రావని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా అల్లాదుర్గంలో పర్యటించి వ్యాధులు, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి ప్రాంతంలో నీటి నిల్వలు ఉంటే, ఇళ్లలో డ్రమ్ములు ఉండే చోట దోమలు స్థావరాలు ఏర్పాటు చేసుకొని ఉంటాయని ఆయన చెప్పారు. ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెందవని, వ్యాధులు రావని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహ్మద్‌నగర్‌లో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వినియోగంలో లేని తొట్లలో నీరు నిల్వ ఉంచొద్దని తొలగించాలని చెప్పారు. నీరు ఎక్కువ రోజులు వాడకుండా నిల్వ ఉంటే దోమలు పెరుగుతాయని దీంతో వ్యాధులు సోకుతాయని తెలిపారు. వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.


అల్లాదుర్గంలో ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

దేశ అభివృద్ధికి శాస్త్రీయ విజ్ఞానమే పునాది


మాట్లాడుతున్న సీఐ నాగరాజు

మెదక్ మున్సిపాలిటీ: దేశ అభివృద్ధికి శాస్త్రీయ విజ్ఞానమే పునాది అని టౌన్ సీఐ నాగరాజు అన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మెదక్ టౌన్‌లోని గీత జూనియర్ కళాశాలలో టౌన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం-డ్రగ్స్-మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీఐ నాగరాజు, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. దొంగ స్వాములు.డ్రగ్స్ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రసాద్ రావు, ప్రిన్సిపాల్ సాయిరామ్, పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

● టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని టీవీవీపీ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కౌడిపల్లి పీహెచ్‌సీ, సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఓపీ, లేబర్‌రూం, మందుల పంపిణీ, రోగుల వార్డును, నూతనంగా నిర్మాణంలో ఉన్న సీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సీహెచ్‌సీ కొత్త భవనం నిర్మాణం పూర్తియితే మరింత సేవలు అందుబాటులోనికి వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీవీవీపీ డీసీహెచ్ఓ శివదయాల్, మండల వైద్యాధికారి శ్రీకాంత్, సీహెచ్ఓ ఎలిజబెత్ రాణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


కౌడిపల్లి పీహెచ్‌సీలో ఓపీ వివరాలు తెలుసుకుంటున్న టీవీవీపీ కమిషనర్ అజయ్

విద్యారంగంపై ప్రభుత్వ వివక్ష


తహసీల్దార్ సింధూరేణుకకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సరైన వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ సింధూరేణుకకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ.. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని, చదువులు పూర్తి చేసిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో సంబంధం లేకుండా సర్టిఫికేట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలకు సొంత గదులు లేకపోవడంతో అద్దె భవనాల్లో అనేక అవస్థలు ఎదుర్కొంటున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ చేస్తున్నారని, విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ మెదక్ పట్టణాధ్యక్షులు భాను, అజయ్ తదితరులు ఉన్నారు.

ఐడీలు మంజూరు చేయండి


డీటీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులకు ఎంప్లాయి ఐడీలు అందజేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ అన్నారు. శుక్రవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో చిలప్‌చెడ్ మండల శాఖ తరఫున డీటీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎస్‌టీఓ వేణు మాట్లాడుతూ.. డీటీఏ కార్యాలయం నుంచి జాయినింగ్ తేదీపై క్లారిటీ రాగానే ఎంప్లాయి ఐడీలను మంజూరు చేస్తామన్నారు. పీఆర్టీయూ నాయకులు రాములు, రమేశ్, నాగరాజు, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మట్టిపెడ్డలు లేని ధాన్యం తీసుకురావాలి

● ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు పొల్లు, మట్టిపెడ్డలు లేని ధాన్యం తీసుకురావాలని ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొట్టాల, పీర్యతండాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తేమశాతం ఎక్కువ లేకుండా ధాన్యం ఎండబెట్టాలన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం చైర్మన్ చంద్రం ప్రారంభించారు. పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, మున్సిపల్ కౌన్సిలర్లు యాదగిరి, సుందర్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, సంఘం డైరెక్టర్ ఐలయ్య, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


రామాయంపేట(మెదక్): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంఘం చైర్మన్ చంద్రం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మడూర్ సొసైటీ పరిధిలోని ఎస్.కొండాపూర్, టీ.మాందాపూర్, మిర్జాపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మడూర్ సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదగిరి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు విఠల్‌నాయక్, సీఈఓ కృష్ణా పాల్గొన్నారు.

15 రోజులుగా తాగునీటి గోస

● ఖాళీబిందెలతో గ్రామస్తుల ఆందోళన

మనోహరాబాద్(తూప్రాన్): 15 రోజులుగా తమకు తాగునీరు రావడంలేదని రంగాయపల్లి గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మనోహరాబాద్ మండల పరిధిలోని రంగాయపల్లి గ్రామంలో 15 రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు రావడం లేదని గ్రామ పంచాయతీ వద్ద మహిళలు ఖాళీబిందెలతో నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేము తాగునీటి సమస్యతో బాధపడుతున్నా.. పట్టించుకునే నాథులు కరువయ్యారని, అధికారుల నిర్లక్ష్యంతో తమకు కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నిత్యం కూలీ నాలి చేసుకొని బతుకేవాళ్లమని, కానీ నీరు రాకపోవడంతో కూలీకి వెళ్లకుండా నీటి కోసం తిప్పలు పడుతున్నామన్నారు. ఈ విషయం తెలుసుకున్న వాటర్ గ్రిడ్ ఏఈ శ్రీధర్, మిషన్ భగీరథ ఏఈ దివ్య గ్రామానికి వచ్చి మహిళల సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గ్రామానికి సరఫరా జరిగే లైన్‌లో ఎయిర్‌లాక్ వల్ల నీరు తక్కువగా వస్తుందని, దాంతో కొన్ని కాలనీల్లో నీరు తక్కువగా సరఫరా అవుతుందన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని, సమస్య రాకుండా చూస్తామని హామీనిచ్చారు. దీంతో గ్రామ మహిళలు తమ నిరసనను విరమించారు.

సికింద్లాపూర్‌కు అందని భగీరథ నీరు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా కావట్లేదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి సంబంధించి భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ నీరు మాత్రం రక్షితవాటర్ ట్యాంకులోకి చేరడం లేదు. కాగా గ్రామస్తుల తాగునీటి అవసరాల కోసం రెండు రక్షిత వాటర్ ట్యాంకుల్లోకి గ్రామ పంచాయతీ సిబ్బంది బోరుబావు నీటిని సరఫరా చేస్తున్నారు. స్వచ్ఛమైన భగీరథ నీరు అందించాలనే సంకల్పంతో పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ ఎత్తు ప్రదేశంలో ట్యాంకు ఉన్నందున నీరు రావడంలేదని భగీరథ సిబ్బంది చెప్పినట్లు పంచాయతీ కార్యదర్శి రాజు తెలిపారు. గ్రామ పరిధిలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి నిత్యం వివిధ ప్రాంతాల భక్తులు వస్తుంటారు. భగీరథ నీరు రాకపోవడం వలన వారు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సికింద్లాపూర్‌తో పాటు లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి భగీరథ నీరు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రంగాయపల్లి గ్రామ పంచాయతీ వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సంక్షిప్త వార్తలు

◆ **సోయా పంటను కొనుగోలు చేయాలి**

రేగోడ్(మెదక్): సోయా పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, కొత్వాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ నర్సింలు శుక్రవారం కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

◆ **శ్రమదానం**

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని కేసీఆర్ (డబుల్ బెడ్రూం ఇళ్ల)కాలనీలో శుక్రవారం కాలనీవాసులు శ్రమదానం నిర్వహించారు. వారు కాలనీ దారిలో ఉన్న చెట్లు, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు. కొన్ని రోజులుగా కాలనీలో పాముల బెడద తీవ్రతరమైందని, దీనితో శ్రమదానం చేపట్టామన్నారు.

◆ **మహాసభలను జయప్రదం చేయండి**

తూప్రాన్: నవంబర్ 2, 3 తేదీల్లో తూప్రాన్ పట్టణంలో నిర్వహించే సీపీఐ(ఎం) జిల్లా 15వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని లింగారెడ్డి గార్డెన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో కార్మికుల, రైతులు, పేదలు, కూలీలు, మహిళలు, దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపైన సీపీఐ(ఎం) పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మల్లెచెరువు కట్టపై ప్రమాదాలు**

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో సిద్దిపేట రూటులో మల్లెచెరువు కట్టపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని బీజేపీ జిల్లా నాయకులు శంకర్‌గౌడ్, కార్తీక్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. చెరువు కట్టపై రోడ్డు పాక్షికంగా శిథిలమై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రాంతంలో స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగంగా వెళ్తూ.. అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్తున్నాయన్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో వాహనాలు చెరువులో పడిపోవడంతో కొందరు మృత్యువాత పడ్డారని తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

◆ **తపస్ ఉపాధ్యక్షురాలిగా మాధవి**



చిన్నశంకరంపేట(మెదక్): తపస్ ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా మండలంలోని మిర్జాపల్లి జెడ్పీపాఠశాల ఉపాధ్యాయురాలు మాధవి ఎన్నికైనట్లు తపస్ మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వరూపరాణి, సుజాత తెలిపారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. తపస్ ఉపాధ్యాయ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై ఎప్పకప్పుడు స్పందిస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఎంపిక చేసినందుకు సంఘం బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **కోతులు రాకుండా పులి బొమ్మ**



శివ్వంపేట(నర్సాపూర్): కోతుల బారి నుంచి రక్షణ కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోజు రోజుకు కోతుల బెడద పెరిగిపోతుండడంతో వ్యాపారులు ఇబ్బందులు చెప్పనక్కర్లేదు. శివ్వంపేటలోని ఓ రైస్‌మిల్ వద్ద కోతుల రాకుండా వ్యాపారి పులి బొమ్మ పెట్టాడు.

◆ **సన్మానం**



రామాయంపేట(మెదక్): బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ నాగరాజు జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయనను మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, పార్టీ కార్యకర్తలు సన్మానించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అనిల్‌కుమార్, పెద్ద మల్లారెడ్డి సొసైటీ చైర్మన్ రాజాగౌడ్, నాయకులు యాదగిరి, శ్యాం, కృష్ణాగౌడ్, నవాత్ మహేశ్, కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.